

బీఆర్ఎస్ ఆందోళనలు

- ప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేయాలంటూ గాంధీజీ విగ్రహాలకు వినతులు
- జిల్లా వ్యాప్తంగా శాంతియుతంగా గులాజీ శ్రేణుల నిరసనలు

8



మానుకోటలో వినతిపత్రం అందిస్తున్న కవిత, శంకర్‌నాయక్



ఆత్మీయ భరోసా ఏదీ?

మహబూబాబాద్ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీల పరిధిలోని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తించదా.! అంటే ఔననే సమాధానం వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో గుంట భూమిలేని, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)లో 20రోజులకు పైగా పనులు చేసిన వారికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించేలా ప్రభుత్వ నిబంధన ఉంది. మునిసిపాలిటీల పరిధిలోని కూలీలు ఆత్మీయ భరోసా పథకానికి దూరమయ్యారు. గ్రామీణ ప్రాంతాల కూలీలు మాత్రమే ఆ పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంది. గిరిజన ప్రాబల్య మహబూబాబాద్ జిల్లాలో నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిలో 487 గ్రామ పంచాయతీలున్నాయి.

ఇటీవల రాష్ట్రప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈనెల 26న గణతంత్ర్య దినోత్సవం రోజున జిల్లాలోని ప్రతీ మండలంలో ఒక్కో గ్రామాన్ని ఎంచుకుని ఆ సంక్షేమ పథకాలను లాంచనంగా ప్రారంభించారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఆయా పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయడానికి జనవరి మాసంలో సర్వేలు చేపట్టి 21వ తేదీ నుంచి 24 వరకు గ్రామాల్లో గ్రామ సభలు, మునిసిపాలిటీల పరిధిలో వార్డుసభలు నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు, అర్హత ఉండి ఎంపిక జాబితాలో పేరు లేని వారి నుంచి అధికారులు మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు.

మునిసిపాలిటీల పరిధి కూలీలకు భరోసా ఎలా?

మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు తొర్రూరు, మానుకోట, డోర్నకల్, మరిపెడల్లో ఉన్న నిరుపేద వ్యవసాయ కూలీలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి దూరమయ్యారు. ఆత్మీయ భరోసా పథకం ద్వారా గుంట భూమిలేని కూలీలకు నెలకు రూ.1000 చొప్పున సంవత్సరానికి రూ.12 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. మహబూబాబాద్ పట్టణంతో పాటు 2018లో మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు అనంతారం,

మిగతా 8వ పేజీలో...

- 'పురపాలక' కూలీలకు అందని పథకం
- ఉపాధి హామీలో 20 రోజులకు పైగా చేసిన వారికే అవకాశం
- నష్టపోతున్న పట్టణ పరిధిలోని వ్యవసాయ కూలీలు
- ప్రభుత్వం వర్తింప చేయాలని డిమాండ్

కూలీలందరికీ ఆత్మీయ భరోసా అందించాలి



గుజ్జు దేవేందర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గ్రామ, మునిసిపాలిటీ అని తేడా లేకుండా కూలీలందరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా సంవత్సరానికి రూ.12 వేలు అందించాలి. ఉపాధి హామీ పథకంలో 20 రోజులకుపైగా పనులు చేసిన కూలీలే వారే ఈ పథకానికిఅర్హులని ప్రభుత్వం ప్రకటించడంతో మునిసిపాలిటీ పరిధిలోని కూలీలకు ఆ పథకం వర్తించడం లేదు. ప్రభుత్వం ఆ నిబంధనను సడలించి కూలీలందరికి ఆత్మీయభరోసా పథకం వర్తించేలా చూడాలి. అదే విధంగా మునిసిపాలిటీల్లో సైతం కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి.

మాకేదీ ఆత్మీయ భరోసా ?



గూడూరు వెంకన్న, సేవానగర్, మరిపెడ బంగ్లా

మునిసిపాలిటీ మాకు శాపంగా మారింది. నిల్వ నీడలేదు. సెంటు భూమి లేదు.. రెక్కాడితేనే డొక్కాడే మా బతుకులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తించకపోవడం బాధాకరం. మునిసిపాలిటీల్లోని భూమిలేని నిరుపేద కూలీలకు ప్రభుత్వం ఆత్మీయ భరోసాను వర్తింప జేయాలి.

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



గాంధీ వర్ధంతి కార్యక్రమంలో మౌనం పాటిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య పోరాటంలో ఎంతోమంది తమ ప్రాణాలను పణంగా పెట్టి, దేశానికి స్వాతంత్ర్య తీసుకువచ్చారని, వారి త్యాగాలను స్మరించుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని అమరవీరుల జ్ఞాపకార్థం కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహనీయులు అమరులై, త్యాగధనులుగా నిలిచారని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుని భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, అధికారులు హరిప్రసాద్, శ్రీనివాసరావు, మరియన్న పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

మహబూబాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5 నుంచి 25 వరకు జరిగే థియరీ ఎగ్జామ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు 40 కేంద్రాలు, థియరీ పరీక్షలకు 20 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 4,392 మంది, ద్వితీయ సంవత్సరంలో 4,910 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అన్ని పరీక్షాకేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, ఆర్టీసీ బస్‌సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి, ఆర్డీవో కృష్ణవేణి, అధికారులు మదార్,హరిప్రసాద్, డాక్టర్ మురళీధర్, ఎం.శివప్రసాద్, శ్రీరాములు, గోపాలకృష్ణ, ఉపేందర్, బి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇనుగుర్తి ఎంపీడీవోగా హరిప్రసాద్



8

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



ఫాతిమా హైస్కూల్ సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి




ఫాతిమా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ గ్రీన్ కోర్‌లో ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఫాతిమా హైస్కూల్‌లో గురువారం మినిస్ట్రీ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమెట్ చేంజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ గ్రీన్ కోర్ వేస్ట్‌టు వెల్త్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ పోటీల్లో 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన జడ్పీహెచ్ఎస్ కంబాలపల్లికి రూ.3 వేల నగదు, ద్వితీయస్థానంలో నిలిచిన నెల్లికుదురు కేజీబీవీకి రూ. 2 వేలు, తృతీయస్థానంలో నిలిచిన మానుకోట ఏకశిలా ఏంజిల్స్ హైస్కూల్ రూ.1000, మొదటి కన్సోలేషన్ బహుమతి పొందిన మానుకోట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు రూ.500 నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణపై దృషి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీసీ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఎన్జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ వి.గురునాథరావు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ఇంగ్లీష్ స్టడీ మెటీరియల్..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రాక్టీస్ పేపర్ల మెటీరియల్‌ను డీఈవో రవీందర్‌రెడ్డి ఎస్సెస్సీ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు ఇంగ్లీష్‌లో ఎలాంటి ఇబ్బందిలేకుండా సులువుగా పరీక్ష రాసేందుకు ప్రాక్టీస్ పేపర్లతో కూడిన స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌బాధ్యులు కిరణ్‌ప్రసాద్, హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, విజయ్‌కుమార్, రామ్మోహన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తికళాకారులు, చిన్నజీయర్ అభివాదం

నగరం.. ఆధ్యాత్మిక సౌరభం

- ఓరుగల్లులో నేత్రపర్వంగా శోభాయాత్ర
- ఉమ్మడి జిల్లా నుంచి తరలొచ్చిన భక్తికళాకారులు
- హిందూ ధార్మిక విలువలను విస్తరింపచేద్దాం..
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి

7

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని మహాత్మాజ్యోతిరావు పూలె గురుకుల, బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గురుకులాల, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయ, అధ్యాపకులకు జీరో వన్ జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. అసంబద్ధమైన పనివేళలను మార్చాలని, ఆరోగ్యకార్డులు ఇచ్చి కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులకు గెజిటెడ్ హోదా కల్పించాలని, మోడల్ స్కూల్స్‌లో రెండోపేజ్‌లో నియామకమైన ఉపాధ్యాయులకు సర్వీస్‌ను నోషనల్‌గా పరిగణిస్తూ వేతన స్థిరీకరణ చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ చెల్లించాలని, వివిధ సెలవులు వర్తింపచేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకొని 30 శాతం ఫిట్మెంట్ తగ్గకుండా అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో నూతన విద్యావిధానం అమలు చేయవద్దని, ప్రీప్రైమరీ తరగతులను అంగన్‌వాడీలో కలపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించాలన్నారు. నాయకులు మురళీకృష్ణ, షేక్ యాకూబ్ పాల్గొన్నారు.



రైల్వే డీఆర్ఎం భరతేష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రైల్వే డీఆర్ఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

కాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే భవన్‌లో గురువారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్‌ను, ఏడీఆర్ఎం ఎం.గోపాల్‌ను కలిశారు. కాజీపేటలో నిర్మించ తలపెట్టిన బస్టాండ్‌పై చర్చించారు. సాధ్యమైనంత త్వరగా బస్టాండ్ స్థలాన్ని అప్పగిస్తే, శంకుస్థాపన పనులు చేపడుతామని కోరారు. అనంతరం బస్టాండ్ స్థల మ్యాప్‌ను పరిశీలించారు. బస్టాండ్ స్థలాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరుతూ వినతిప్రతం సమర్పించారు. బస్టాండ్ ప్రతిపాదనలు త్వరలో రైల్వే బోర్డుకు పంపిస్తామని డీఆర్ఎం చెప్పి నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఎండీ అంకూస్ ఉన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు పతకం



బంగారు పతకం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ నవీన్ (మధ్యలో ఉన్న వ్యక్తి)

వరంగల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కుస్తీ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకుంది. కరీంనగర్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో ఏఆర్ కానిస్టేబుల్ నవీన్ 97 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారుడిపై విజయం సాధించి నవీన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తొలి బంగారు పతకాన్ని సాధించి పెట్టాడు. ఈ సందర్భంగా నవీన్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా, జట్టు మేనేజర్ నాగయ్య అభినందించారు.

పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కుసుమ శ్రీనివాస్

హనుమకొండ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకునేందుకు పాఠశాలతో పాటు, ప్రత్యేక శిక్షణ అవసరమని సన్మార్గం, సత్ప్రవర్తన శిక్షణ ప్రధాన పర్యవేక్షకుడు కుసుమ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన కొలనుపాక సుమన్ శాస్త్రితో కలిసి యాదవ నగర్‌లో వేసవికాలంలో నిర్వహించే శిక్షణ శిబిరం వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 20 వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని, జూన్ 11వ తేదీ నుంచి 41 రోజులు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 ఏళ్ల నుంచి 14 ఏళ్ల మగ పిల్లలకు మాత్రమే ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో శ్రద్ధ తీసుకొని శిబిరానికి పంపిస్తే చక్కని క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన, విద్య పట్ల ఆసక్తి, కళల పట్ల మక్కువ కలిగేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తామని కుసుమ శ్రీనివాస్ చెప్పారు. వివరాల కోసం 9849267993 మొబైల్‌లో సంప్రదించాలని సూచించారు.

డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- షీటీమ్ ఫిర్యాదులపై సున్నితంగా వ్యవహరించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- ఆర్గనైజన్, హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా

వరంగల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : డయల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి వీలైనంత తొందరగా చేరుకోవాలని ఆర్గనైజన్ అండ్ హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఉదయం పోలీసు అతిథి గృహానికి చేరుకున్న అడిషనల్ డీజీపీకి సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సాయుధ బలగాలు గౌరవవందనం చేశారు. తనిఖీల్లో భాగంగా కమిషనరేట్ కార్యాలయానికి చేరుకొని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీపీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా, చిత్రంలో సీపీ అంబర్ కిశోర్ ఝా, పోలీసు అధికారులు

అనంతరం డీజీపీ స్వాతి లక్రా మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ఏర్పాటైన షీటీమ్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు షీ టీమ్‌లో ఇచ్చే ఫిర్యాదులను అధికారులు సున్నితంగా పరిష్కరించాలన్నారు. బాధితులకు న్యాయం కల్పించడంతో పాటు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదులపై తప్పనిసరిగా కేసు నమోదు చేయాలన్నారు. స్టేషన్ అధికారులకు భరోసా కేంద్రం పనితీరు తెలిసేలా కేంద్రాన్ని సందర్శించి అక్కడి కార్యకలాపాలను తెలుసుకోవాలన్నారు. ట్రాఫిక్, మత్తు పదార్థాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కళాశాలల్లో సేఫ్టీ ఉమెన్, సేఫ్టీ ట్రాఫిక్, యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ క్లబ్‌లను ఏర్పాటుచేసి సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. జాగృతి కళాబృందం ద్వారా ప్రజలకు నష్టం కలిగే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల నిర్మూలన కోసం నిరంతరం తనిఖీలు కొనసాగించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కమిషనరేట్ భవనంతో పాటు రిజర్వుడ్ ఆయుధాగారంతోపాటు డాగ్ స్క్వాడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు సలీమా, రవీందర్, రాజ మహేంద్ర నాయక్, అదనపు ఎస్పీలు చేతన్, మనాన్ భట్, ఏఆర్ అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

బీసీలు రాజకీయాలను శాసించాలి

పద్మశాలీ సంఘం జాతీయ నేత ఈగ మల్లేశం

వడ్డెపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజకీయాలను శాసించి రాజ్యాధికారాన్ని చేపట్టి హక్కులను సాధించుకోవాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ పూర్వ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాలుగా ఆధిపత్య కులాల పాలకులు బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కడానికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తెచ్చి తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాష్ట్రంలోని 60 లక్షల మంది నిరుద్యోగులకు శాపంగా మారాయన్నారు. కేవలం మూడు శాతం ఉన్న ఓసీ కులాలకు 10 శాతం, 65 శాతం ఉన్న బీసీలకు 29 శాతం రిజర్వే షన్లు మాత్రమే అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్రనేత గుండు ప్రభాకర్ మాట్లా డుతూ.. బీసీల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్రప భుత్వాల దృష్టి కి తీసుకెళ్లేందు కోసం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వం లో ఫిబ్ర వరి 2న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మధ్యా హ్నం 2గంటలకు నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు రాజకీయాలకతీతంగా అన్ని బీసీ కులాలతో పాటు పద్మశాలీ కులస్థులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వడ్నాల నరేందర్, చంద మల్లయ్య, బచ్చు ఆనందం, దుస్స శివశంకర్, ఆడెపు రవీందర్, చిప్ప వెంకటేశ్వర్లు, శామంతుల శ్రీనివాస్, బేతి అశోక్, మేడారపు సుధాకర్, గాడి పల్లి రాజేశ్వర్‌రావు, బైరి శ్రీనివాస్, పరికిపండ్ల వేణు, జానకీరాములు, బీ రమేష్, శివశంకర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఈగ మల్లేశం, శ్రీరాములు, సమ్మారావు

ఐలాపూర్ జాతర పనులు పూర్తి చేయాలి

అధికారులతో ములుగు కలెక్టర్ దివాకర



ఐలాపూర్‌లో గద్దెల ప్రాంగణంలో జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

కన్నాయిగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్‌లో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. గురువారం ఆయన ఐలాపూర్‌లో పర్యటించారు. భక్తులకు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాల కోసం చేపడుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా జాతర పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం వనదేవతలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు మల్లెల రవి, మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య, వీరీల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజుల ఆలయాన్ని సందర్శన

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయి, మాల్యాల, దొడ్ల గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. గోవిందరాజుల ఆలయాన్ని సందర్శించిన ఆయనకు సారలమ్మ ప్రధాన పూజారి, మాజీ సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు గిరిజన సాంప్రదాయ ప్రకారం స్వాగత పలికారు. అనంతరం గోవిందరాజుకు కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 12 నుంచి జరిగే మేడారం మినీ జాతర సందర్భంగా కొండాయిలోని గోవిందరాజుల ఆలయం వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాపై తప్పుడు ప్రచారం చేశారు

- ఏ ఉగ్రవాద సంస్థతో మాకు సంబంధం లేదు
- పోలీసులు విచారణ చేసింది వాస్తవమే..
- మా సంఘానికి క్లీన్ చిట్ ఇచ్చి పంపించారు
- ఆల్ ఇండియా జమాతే ముస్లీమి అధ్యక్షుడు జక్రియా

వరంగల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందని, తనకు, తమ సంఘానికి ఏ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు లేవని ఆల్ ఇండియా జమాతే ముస్లీమి జాతీయ అధ్యక్షుడు జక్రియా స్పష్టం చేశారు. గురువారం వరంగల్ చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను 2021మార్చి నుంచి ఆల్ ఇండియా జమాతే ముస్లీమి సంఘానికి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానన్నారు. అయితే ఈ నెల 25వ తేదీన తాను శ్రీలంకకు వెళుతుండగా, చెన్నై ఎయిర్ పోర్టులో ఇమ్మిగ్రేషన్ వద్ద పోలీసులు తనను నిలిపి అదుపులోకి తీసుకున్నారని, రెండు రోజులు వారి అదుపులోనే ఉంచుకుని, ఫోన్, పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నారన్నారు. రెండు రోజుల విచారణ తర్వాత తరువాత తమ సంఘానికి ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధాలు లేవని క్లీన్‌చిట్ ఇచ్చారని వివరించారు. తమ సంఘం ప్రచారానికి ఎక్కడైనా పోవచ్చని అధికారులు పేర్కొన్నారని తెలిపారు. అయితే తనకు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్టు కొన్ని సోషల్ మీడియాల్లో తప్పుడు ప్రచారం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్టు జక్రియా తెలిపారు.



ఉపాధి పనుల నివేదికను ప్రజావేదికలో వివరిస్తున్న డీఆర్పీలు

ఉపాధి హామీలో గోల్‌మాల్.!?

మరిపెడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది మరిపెడ మండలంలోని 44 గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో గోల్‌మాల్ జరిగినట్లు గురువారం జరిగిన సోషల్ ఆడిట్ ప్రజా వేదికలో వెల్లడైంది. ఊరూరా ఎఫ్ఏలు గతం లాగానే మళ్లీ అవే కాకి లెక్కలతో అక్రమాలకు పాల్పడ్డట్లు బట్టబయలైంది. సోషల్ ఆడిట్ సర్వే బృందాలు పక్షం రోజులుగా మండలంలోని ఊరూరా జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ నివేదికలను గురువారం మరిపెడ మండల్ పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఇన్‌హౌస్ ప్రజావేదికలో డీఆర్పీలు జిల్లా ఉన్నతాధికారులకు పలు ఆసక్తికర విషయాలను నివేదించారు. ఎఫ్ఏలు తమ అనుయాయులకు పనులు చేయకున్నా మస్టర్ రోల్‌లో పేర్లు రాసి బిల్లులు స్వాహా చేసినట్లు వెల్లడయ్యింది. ఆనేపురంస్టేజీ, నీలికుర్తి, ఎల్లంపేట, వీరారం, ఉల్లెపల్లి, గాలివారి గూడెం తదితర గ్రామాల్లో పనులు లేకుండానే బిల్లులు పొందారు. నీలికుర్తి, ఎల్లంపేట గ్రామాల ఎఫ్ఏలను విధుల నుంచి తొలగించాలని ఆయా గ్రామాల బాధితులు డీఆర్డీఏ పీడీకి ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని డీఆర్డీఏ పీడీ మధుసూదన్‌రావు చెప్పారు. కార్యక్రమంలో డీవీసీ మన్మోహన్, ఏపీసీ అంజిగౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీవో కనకదుర్గ, గతంలో పని చేసిన ఎంపీడీవో ధన్‌సింగ్, అంబుడ్స్ మేనేజర్ ఆదామ్, ఎస్ఆర్పీలు చెన్నకేశవులు, కొమురయ్య, ఏపీవో మంగమ్మ, ఎంపీవో సోమ్లానాయక్, ఎఫ్ఏలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎమ్మెస్సీ ప్రాక్టికల్ తరగతులు

కేయూ క్యాంపస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కేయూ దూరవిద్య కేంద్రం 2023-24 ఏడాదికి సంబంధించిన ఎమ్మెస్సీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్-1 ప్రాక్టికల్ తరగతులను నిర్వహిస్తామని కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట గోపీనాథ్ గురువారం తెలిపారు. ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగం కోర్సుల అభ్యర్థులందరూ వర్సిటీలోని ఆయా విభాగాల్లో నిర్వహించే ప్రాక్టికల్ తరగతులు ఫిబ్రవరి 1 నుంచి 8వ తేదీల్లో జరుగుతారని వెల్లడించారు. అలాగే ఫిబ్రవరి 9, 10న ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తరగతులకు హాజరై పరీక్షలు రాయాలని కోరారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా కిశోర్



డాక్టర్ కిశోర్‌కు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

వరంగల్ మెడికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిశోర్ పూర్తి అదనపు బాధ్యతలు గురువారం స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిశోర్‌ను టీఎన్‌జీవో హనుమకొండ జిల్లా అధ్యక్షు డు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ.. ఎంజీఎం అభివృద్ధికి, రోగు ల సంరక్షణకు, మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఇస్మాయిల్ అలీ, లక్ష్మీప్రసాద్, రవికుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గోదాముల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వర్‌రావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాయల నాగేశ్వర్‌రావు

హనుమకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గోదాముల నిర్వహణతో పాటు అందులో నిల్వల రికార్డులు సక్రమంగా ఉండాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వరంగల్ రీజియన్ పరిధిలోని గిడ్డంగుల సంస్థల మేనేజర్లతో నాగేశ్వర్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిడ్డంగుల నిర్వహణపై వారికి పలు సూచనలు చేశారు. గోదాముల్లో బాగా కష్టపడి పని చేసేవారిని గుర్తించి వారికి ప్రోత్సాహం ఇస్తామన్నారు. గోదాముల్లోని నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, గోదాముల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. గోదాముల్లో ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. గోదాములను ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనఖీలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ ఎండీ కొర్ర లక్ష్మి, జనరల్ మేనేజర్లు ఆనంద్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో యువకుడి ఆత్మహత్య

మృతుడి స్వస్థలం ఏపీలోని విశాఖపట్టణం

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస సెంటర్‌లోని శివప్రియ లాడ్జ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణానికి చెందిన యువకుడు పనస పతంజలి పవన్ ప్రేమ్‌కుమార్ (31) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్టణం జిల్లా నర్సీపట్నంలోని చాకలీ కాలనీకి చెందిన పవన్ ప్రేమ్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం 12.25 గంటలకు శివప్రియ లాడ్జ్‌లోని రూమ్ నెంబర్ 107ను అద్దెకు తీసుకున్నాడు. లాడ్జ్ యాజమానికి ఎస్ఎస్‌సీ పరీక్ష ఉందని, అందుకే విశాఖపట్టణం నుంచి ఇక్కడికి వచ్చానని తెలిపినట్లు చెప్పారు. పవన్ ప్రేమ్‌కుమార్‌కు మూడు నెలల క్రితం వివాహం అయినట్లు తెలిసింది. తల్లిదండ్రులు వస్తే కానీ పవన్ ప్రేమ్ కుమార్ ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందో.. వివరాలు తెలుస్తాయని ఎస్సై పేర్కొన్నారు. కాగా, మృతుడి వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో సమాచారం ఆలస్యమవుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2525	2130
పల్లికాయ (సూక)	6300	4600
పల్లికాయ (పచ్చిది)	5400	3100
పత్తి	7010	5800
పసుపు (కాడి)	-	-
ఎల్లో మిర్చి	16500	13500
తేజ మిర్చి	13500	9000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్ 341	14500	11500
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

క్వింటా మిర్చిని రూ.25 వేలకు కొనాలి

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : క్వింటా మిర్చి రూ.25 వేలకు కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తూ గురువారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాట్లాడారు. మార్కెట్‌లో క్వింటా మిర్చిని అధికంగా రూ.13 వేలకే కొనుగోలు చేయడ దారుణమని విమర్శించారు. భారీ ఎత్తున మిర్చి మార్కెట్‌కు తరలివస్తున్నప్పటికి ధరను నామమాత్రం ధరలకే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. గత ఏడాది క్వింటా మిర్చి రూ.24 వేలధర పలికిందని చెప్పారు. ఓ వైపుమిర్చి 35-40 క్విం టాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 15-20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని దాంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. వ్యాపారులు, దళారులతో అధికారులు కుమ్మక్కై మిర్చి రైతును చిత్తు చేస్తున్నారని విమర్శించారు. కోల్డ్ స్టోరేజ్‌లలో దాచుకుందామనుకున్న వ్యాపారులు, కమిషన్ ఏజెంట్‌లే తిష్ట వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దళారి వ్యవస్థను నివారించాలని అందుకు గాను అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లలో కూడ తనిఖీలు నిర్వహించాలని, తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి మిర్చి ని కొనుగోలుచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, అధ్యక్షులు గునిగంటి రాజన్న, ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, పల్లా ప్రభాకర్‌రెడ్డి, బయ్య సోమన్న, నీరుటి జలేందర్, కట్ల కృష్ణయ్య, బానోత్ రమేష్, వెంకన్న, పులగుజ్జు రామ్మూర్తి, అంగోత్ ఇస్లా, రామసాని రాంరెడ్డి పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు



కేయూలో పదవుల పందేరం

కేయూ క్యాంపస్ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో నూతన పరిపాలన అధికారులు త్వరలోనే పగ్గాలు చేపట్టనున్నారు. రిజి స్ట్రార్‌తో సహా ఇతర కీలక పదవులన్నింటినీ సమర్థులతో భర్తీ చేసేందుకు వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఇప్పటికే సమాలోచనలు చేసినట్లు సమాచారం. అయితే ఎవరు ఏ పోస్టుకు సరిపోతారనే అంశంలో కొంత సంశయంలో ఉన్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక భేటీ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు పరిపాలన పదవుల భర్తీ విషయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అయితే వీసీ ఓసీవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కచ్చితంగా ఎస్సీ వర్గానికి చెందిన ప్రొఫెసర్‌కే రిజిస్ట్రార్ పదవి వస్తుందని వర్సిటీలో జోరుగా చర్చ నడుస్తోంది. రిజిస్ట్రార్‌తో పాటు మరిన్ని కీలక పదవులైన కేయూ డెవలప్‌మెంట్ ఆఫీసర్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సీడీసీ అకడమిక్ డీన్, సీడీసీ అకడమిక్ ఆడిట్ డీన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్, కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ, కేయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, హాస్టల్స్ డైరెక్టర్‌తో పాటు ఇతర కీలక పదవుల్లోకి కొత్తగా పలువురు ప్రొఫెసర్లతో భర్తీకానున్నాయి. ఇప్పుడున్న పరిపాలన అధికారులందరూ గతంలో నియమించబడిన వారు కావడంతో వారందరి పదవులలో మార్పులు, చేర్పులు చేయనున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్సిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో వర్సిటీల్లో పెండింగ్ విషయాలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ఉన్నత విద్య మండలి, ఉన్నత విద్య కమిషనరేట్ కార్యాలయ అధికారులు సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు కోరుతున్నారు. వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది విషయంలోనూ నిబంధనలను విధిస్తున్నారు. వర్సిటీల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండంతో వర్సిటీలో పరిపాలన, అకడమిక్ అధికారుల పాత్ర రానున్న కాలంలో మరింత కీలకం కానుంది.

ఆశావహుల ఎదురుచూపులు

కాకతీయ యూనివర్సిటీలో 409 మంది ప్రొఫెసర్ల పోస్టులకుగాను ప్రస్తుతం 76 మందే రెగ్యులర్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. గతంలో పనిచేసిన కీలకమైన ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందారు. వారి స్థానంలో 2010 తర్వాత నుంచి వర్సిటీలో రెగ్యులర్ నియామకాలు జరగలేదు. 15 ఏళ్లకాలంలో పోయే వారే తప్ప.. వచ్చే వారు కరువయ్యారు. దీంతో వర్సిటీలో తీవ్రమైన ప్రొఫెసర్ల కొరత ఏర్పడింది. 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల బ్యాచ్‌లో 32 మందికి కోర్టు కేసుల నేపథ్యంలో ఇక్రిమెంట్లతో పాటు పదోన్నతులను ఇవ్వలేదు. దీంతో వారికి వర్సిటీలో పరిపాలన పదవులు అందని ద్రాక్షలాగే మారాయి. గత వీసీ కాలంలో ఒక్కరిద్దరి పైరవీలకు తలొగ్గి వర్సిటీలో పరిపాలన పోస్టులు కట్టబెట్టినప్పటికీ తర్వాత తొలగించారు. 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల కేసు విషయం తెలితే వారికీ పరిపాలన పదవులను కేటాయించే అవకాశాలున్నాయి. ఇప్పుడున్న ప్రొఫెసర్ల కంటే అధికంగా వర్సిటీలో పరిపాలన పదవులు ఉండడంతో దాదాపు అందరికీ పదవులు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే పలుకుబడి కలిగిన వర్సిటీ పదవుల కోసం ప్రొఫెసర్ స్థాయి వ్యక్తులందరూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి దృష్టిలో పడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే పదవుల కోసం పైరవీలకు దిగుతున్నారు.

అసంతృప్తి సెగలు

కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్లకు పదవుల పంపిణీపై అసంతృప్తి సెగలు కమ్ముకున్నాయి. వర్సిటీలో పదవులు వచ్చినోళ్లకు వస్తున్నాయని, రానివారికి ఏమీ రాకపోవడంతో పలువురు ప్రొఫెసర్లలో అసంతృప్తి నెలకొంది. కొందరు సర్వీస్‌లోకి వచ్చినప్పటి నుంచి దాదాపు ఏళ్లుగా పరిపాలన పదవుల్లోనే కొనసాగుతున్నారు. వర్సిటీలో పలువురు ప్రొఫెసర్లకు పదవులేమీ కావడం లేదు. పరిపాలన పదవులు నిర్వహించని వారికి వర్సిటీలో ఉద్యోగ విరమణ సమయంలో పలు బెనిఫిట్స్ లభిస్తాయి. దీంతో పదవులకు డిమాండ్ పెరగుతోంది. వర్సిటీలో కీలకమైన డిపార్టుమెంట్లలో పనిచేసే ప్రొఫెసర్లలో సగానికి కంటే ఎక్కువ మంది పరిపాలన పదవుల్లో కొనసాగుతున్నారు. పదవుల్లో ఉన్న ప్రొఫెసర్లు పాఠాలు చేప్పే తీరిక దొరకడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీంతో అకడమిక్ వాతావరణం దెబ్బతింటోంది. వర్సిటీలో పదవులు కొందరు ప్రొఫెసర్లకే ఇచ్చి మరికొందరికీ మొండి చెయ్యి చూపడం పట్ల విమర్శలు వెల్లువెత్తున్నాయి.

కీలకం కానున్న ఓఎస్డీ పోస్టు

గతంలో కేయూలో ఎప్పుడూ లేని ఓఎస్డీ పోస్టును తాజాగా తెస్తున్నారు. వర్సిటీలో ఓఎస్డీ పోస్టుకు రాష్ట్రఫైనాన్స్ సెక్రటరీ అభ్యంతరాలు లెవనెత్తినప్పటికీ వర్సిటీ పాలకమండలి సైతం ఆమోదం తెలిపింది. వర్సిటీలో వీసీ- రిజిస్ట్రార్‌ల మధ్య స్థంగా ఓఎస్డీ పని చేస్తారు. పాలక మండలి, వీసీ నిర్ణయాలను రిజిస్ట్రార్ అమలు చేస్తారు. అయితే మధ్యలో ఓఎస్డీ పోస్టు అవసరమా? అనే అభ్యంతరాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు వర్సిటీలో ఎప్పుడు ఓఎస్డీ పోస్టే లేదు కదా.. అని వర్సిటీలో అందరూ చర్చించుకుంటున్నారు. తాజాగా వర్సిటీలో ఓఎస్డీ పోస్టును భర్తీ చేయనుండటంతో ఓఎస్డీ కీలకంగా మారనున్నారు. అయితే వర్సిటీ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఓఎస్డీ పోస్టు అనవసరమనే భావన వర్సిటీలో నెలకొంది.

- రిజిస్ట్రార్ సహా కీలక పదవులకు కొత్త ముఖాలు
- ఎస్సీ ప్రొఫెసర్‌కు రిజిస్ట్రార్ పోస్టు ఇచ్చే చాన్స్
- పరిపాలన పదవుల్లో కొందరికీ ఎప్పుడూ మొండిచెయ్యే
- సీఎంతో కీలక భేటీ నేపథ్యంలో పోస్టుల భర్తీ అలస్యం

సీఎంతో భేటీ అనంతరమే ప్రకటన



వర్సిటీల డీపీఆర్ (డిటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు)లను తయారు చేయాలని గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్సిటీల వీసీలకు ఆదేశాలు ఇచ్చారు. వర్సిటీల్లో ఇప్పుడున్న సిబ్బంది మొదలుకుని వర్సిటీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలన్నీ తమకు డీపీఆర్ రూపంలో పకడ్బందీగా సమర్పించాలని సూచించారు. వర్సిటీలో వీసీ డీపీఆర్‌ల ఏర్పాటుకోసం కేయూ జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసి డీపీఆర్‌ను సిద్ధం చేశారు. గతంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజులు కేయూ డీపీఆర్‌లను సమీక్షించారు. గతంలో సంక్రాంతి పండగకు ముందే సీఎం - వీసీల భేటీ షెడ్యూల్ ఉండగా, మళ్లీ ఎప్పుడు ఉంటుందనేది తెలియరాలేదు. సీఎం రేవంత్‌రెడ్డితో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి డీపీఆర్‌ల భేటీ ముగిసిన తర్వాత వర్సిటీలో నూతన పరిపాలన అధికారుల నియామకాల ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అలస్యం జరిగితే వీలైనంత త్వరలోనే కొత్త అధికారుల నియామకాల ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి.

వర్సిటీ పదవులు ఇలా..

మ్యాథ్స్ విభాగంలో ఆరుగురికి.. నలుగురు పదవుల్లో ఉండగా జువాలజీలో నలుగురికి.. ముగ్గురు పదవుల్లో కొనసాగుతున్నారు. కెమిస్ట్రీలో ఆరుగురికి ముగ్గురు, కామర్స్‌లో నలుగురికి ఇద్దరు, కంప్యూటర్ సైన్స్‌లో నలుగురికి ఒక్కరు, జియాలజీ, ఎకానమిక్స్‌లో ఉన్న ఒక్కొక్కరు, ఫార్మసీలో ఏడుగురికి ఒక్కరు పరిపాలన పదవుల్లో కొనసాగుతున్నారు. వీరంతా పదవుల్లో ఉంటే విద్యార్థులకు పాఠాలు, పరిశోధన ఎలా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇదిలా ఉండగా, ఇంకా పాలక మండలి సభ్యులుగా, డీన్లు, ప్రిన్సిపాల్స్, హెడ్స్ తదితర అకడమిక్ పదవుల్లోనూ మరికొందరు ప్రొఫెసర్లు కొనసాగుతున్నారు.

నిబంధనలు పాటించు.. క్షేమంగా జీవించు..

- రోడ్డు భద్రతా నియమాలపై అందరికీ అవగాహన అవసరం
- ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం ఎంతో ముఖ్యం
- రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- నేటితో ముగియనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- నెలరోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాల నిర్వహణ


ఉర్సుగుట్ట వద్ద ట్రాలీ ఆటోకు రేడియం స్టిక్కర్ వేయిస్తున్న ఎంవీఐ శోభన్‌బాబు(ఫైల్)

ఖిలావరంగల్ / వర్ధన్నపేట రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 'సెల్‌ఫోన్ కంటే ప్రాణం విలువైంది. హెల్మెట్ కంటే మన తల ఖరీదైంది. కారులోని సీటు బెల్టు మన ప్రాణాలను రక్షిస్తుంది' అంటూ పోలీసులు, రవాణాశాఖ అధికారులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిని వాహనదారులు గుర్తించినప్పుడే రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య తగుతుందని.. అందుకే 'రోడ్డు నిబంధన పాటించు.. క్షేమంగా జీవించు' అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 1న ప్రారంభమైన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగుస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసులు అధికారులు వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన వస్తున్న చెట్ల పొదలను తొలగింపజేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్లే వాహనదారులను నిలిపి గులాబీ పువ్వులు ఇచ్చి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. 'మీ క్షేమమే.. మా ధ్యేయం' అంటూ తలకు హెల్మెట్లను పెట్టి అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించారు. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ నియమాల గురించి పోస్టర్లు, కరపత్రాలు, సామాజికమాధ్యమాలు, కళాజాత, అవగాహన సదస్సుల ద్వారా వివరించారు. డ్రంకెన్ డ్రైవ్‌లు పెట్టి మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

శిరస్త్రాణమే శ్రీరామ రక్ష

వాహనదారులు శిరస్త్రాణమే శ్రీరామ రక్ష అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెల్మెట్ ధరించని వారిని హెచ్చరించడం, సీటు బెల్టు పెట్టుకోని సూచించడం లాంటివి చేశారు. అయినా సరే చాలా మంది వాహనదారుల్లో పెద్దగా మార్పు రావడం లేదు. నిత్యం ట్రాఫిక్ కూడళ్లలో, హైవేల్లో కూడా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారు. కొంత మంది హెల్మెట్‌లో సెల్‌ఫోన్ ఫిక్స్ చేసి మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. కారు నడిపే వ్యక్తులు సీటు బెల్టు పెట్టుకోకుండా కారు నడిపే దృశ్యాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. సీటు బెల్టు లేకపోవడం వలన సైతం తలకే ఎక్కువగా గాయాలై మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. కొన్ని కొన్ని సార్లు బెలూన్లు ఓపెన్ కాకపోతే ప్రాణాలు నిలవడం కష్టమే. పోలీసులు, రవాణాశాఖ, ఇతర అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ని కొత్త కార్యక్రమాలు తీసుకువచ్చినా తుదిగా పాటించాల్సింది ప్రజలే. ముఖ్యంగా బైక్, కారు నడుపుతున్నప్పుడు స్పీడు ఎక్కువగా పోవడం, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా డ్రైవ్ చేయడం వలన ఈ మధ్యకాలంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడంతో పాటు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలకు గురైనప్పుడు జీవితాంతం బాధ పడాల్సి వస్తోందని చెపుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాల్లో ప్రధానమైనవి..

- ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా శిరస్త్రాణం (హెల్మెట్) ధరించాలి. మితిమీరిన వేగంతో వెళ్లొద్దు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలి. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ గుర్తులను అనుసరిస్తూ ప్రయాణికులు సురక్షితంగా రోడ్లపై తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి.
- వాహనాన్ని నడిపెటప్పుడు సెల్‌ఫోన్‌లను ఉపయోగించకూడదు.
- కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవింగ్ చేసే వారితో పాటు మిగిలిన వారు కూడా సీటు బెల్టును ధరించాలి.
- రోడ్డుపై ఒక వాహనానికి.. మరో వాహనానికి మధ్య 50 అడుగుల దూరం ఉండాలి.
- మద్యం తాగి వాహనం నడపడం నేరం. ఇక ట్రిబుల్, ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదానికి కారణమవుతుంది.
- ఇక పాదచారులు రోడ్లపై నడిచేటప్పుడు ఎడమవైపునుంచి పుట్‌పాత్ పై నుంచి నడవాలి. రోడ్డును దాటాల్సి వచ్చిన క్రమంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, జీబ్రాక్రాసింగ్‌ల వద్ద మాత్రమే రోడ్డు దాటాలి.



అందరినీ చైతన్య పరుస్తున్నాం..

టి. జయపాల్‌రెడ్డి. సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్, వరంగల్.



జాతీయ రోడ్డు భద్రతామాసోత్సవాలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతా నిబంధనలు తెలిసేలా, అందరిలో చైతన్యం కలిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపడం వల్ల జరిగే పరిణామాలు, శిరస్త్రాణం లేకుండా బైకులు నడిపితే ప్రమాదాల బారిన పడే అవకాశాల గురించి తెలియజేశాం. ఇంజనీరింగ్ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు ట్రిబుల్ రైడింగ్, ర్యాష్‌డ్రైవింగ్ తదితర కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు మినీ టెలీఫిలింను ప్రదర్శించాం. వరంగల్ జిల్లాలో రద్దీగా ఉండే ప్రాంతాలు, కూడళ్లు, రోడ్లపై రేడియం స్టిక్కర్లు, జీబ్రాక్రాసింగ్, తదితర గుర్తులను ఏర్పాటు చేస్తున్నాం. పోలీసులు, ఆర్టీఏ అధికారులు, సిబ్బందితో కలిసికట్టుగా ఈ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాం.

అవగాహనతో ప్రమాదాల నివారణ

బి.చందన్, ఎస్ఐ, వర్ధన్నపేట



అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. ప్రతీ ఒక్కరు పోలీసులు, రవాణాశాఖ అధికారులు సూచించే భద్రతా నియమాలను పాటించాలి. రోజు రోజుకు రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్య ఎక్కువ కావడం అందరినీ కలిచివేస్తోంది. దీని పట్ల కనీస అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో వర్ధన్నపేట మండలంలో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రజలను చైతన్య పరచడంతో పాటు డ్రైవర్లను కూడా చైతన్యవంతులను చేస్తున్నాం. ఆర్థిక, సామాజిక, సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లు రోడ్లపై బైకులు వేసుకుని తిరగడాన్ని కఠినంగా పరిగణిస్తాం.



సంకీర్తనా మండలి సమావేశంలో ప్రసంగిస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి, వేదికపై మేయర్ గుండు సుధారాణి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వికాసతరంగిణి ప్రతినిధులు



నగరం.. ఆధ్యాత్మిక సౌరభం

- నగరంలో నేత్రపర్వంగా శోభాయాత్ర
- అలరించిన భక్తి కళాప్రదర్శనలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారులు

హనుమకొండ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరం గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారుల కళాప్రదర్శనలతో హోరెత్తిపోయింది. వికాస తరంగిణి వరంగల్, హనుమకొండ శాఖల ద్వారా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల వరకు సంకీర్తన మండలి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణిలతో కలిసి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ర్యాలీని ప్రారంభించారు. భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, సిద్దిపేట తదితర జిల్లాల నుంచి ప్రాచీక కళారూపాలైన బోనాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలతో ఒక్కో కళారూపం ఒక్కో రకంగా ఏకరూప దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. వరంగల్ నగరానికి చెందిన వికాస తరంగిణి కార్యకర్తలు మంగళ హారతులతో ర్యాలీలో పాల్గొన్నారు. కిలోమీటర్ల పొడవునా ర్యాలీ నేత్రపర్వంగా కొనసాగిన క్రమంలో పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అయినా కళాకారులు ఉత్సాహంతో సంకీర్తనను ఆలపిస్తూ మిన్నంటే జైశ్రీమన్నారాయణ నినాదాలతో నృత్యాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఓరుగల్లు నగర చరిత్రలో ఆధ్యాత్మిక సౌరభంతో కూడిన అతి పెద్ద ర్యాలీగా సంకీర్తన మండలి ర్యాలీ కొనసాగింది.

హిందూ ధార్మిక విలువలను విస్తరింపజేయాలి..

భక్తి కళాసంపూల ద్వారా హిందూ ధార్మిక విలువలను విస్తరింపజేయాలన్న లక్ష్యంతో తన ఆలోచనల ప్రతిరూపంగా సంకీర్తన మండలి ఆవిర్భవించిందని, దాని తొలి కార్యక్రమానికి బోణీగా ఓరుగల్లు నగరం నిలిచిందని పరమహంస పరివ్రాజక ఆచార్యుడు, సమతామూర్తి స్థాపకుడు, పద్మభూషణ్ చిన్నజీయర్‌స్వామి అన్నారు. 2001 సంవత్సరంలో కృష్ణం వందే జగద్గురుమ్, 2003 గీతా జ్యోతి కార్యక్రమాలకు ఓరుగల్లే బోణీగా ప్రారంభమై తెలుగు రాష్ట్రాల్లో విస్తరించాయని, అదే ఆనవాయితీగా తమ సంకీర్తనా మండలి హైందవ భక్తి కళామార్గాన్ని కూడా వరంగల్ నుంచే ప్రారంభింపజేస్తున్నట్లు ఆయన హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ప్రాచీన కళారూపాలను గౌరవించడంతోపాటు కళాకారులను ప్రోత్సహిస్తూ భావితరాల వారికి కళారూపాలను పదిలపర్చేందుకోసమే ఈ సంకీర్తన మండలి పని చేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరిలో మానసిక శక్తిని పెంపొందింపజేసేవి సంకీర్తనేనని, వాటితోపాటు కళారూపాలు కూడా ప్రతీ మనిషిలో చైతన్యం నింపుతాయన్నారు. ప్రతీ కళారూపంలోనూ దైవత్వం దాగి ఉంటుందని, అందుకే ఏ కళారూపాన్ని తీసుకున్నా ధార్మిక చింతన ఉంటుందని చెబుతూ ప్రతీ కళారూపాన్ని ఈ తరం యువతకు అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అనేక సంప్రదాయాల సమహారమే హైందవ ధర్మమని, భగవంతుడితో భక్తుడికి అనుసంధాన సాధనం భక్తి మార్గమని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు ఓరుగల్లు నగరం భక్తి ప్రవాహంలో మునిగిందని, చిడతలు, డప్పులు, కోలాటం, నృత్యం లాంటి ప్రదర్శనలు ఎన్నో తనకు ఆనందంగా కలిగింపజేశాయని చినజీయర్ స్వామి అన్నారు. ప్రతీ ఒక్కరిని భక్తిరసంలోకి తీసుకెళ్లి ఓలలాండింపజేసే గుణం ప్రతీ కళకు ఉంటుందన్నారు. అందులోని సాహిత్యాన్ని తీసుకొని కళారూపాన్ని సజీవంగా ప్రదర్శింపజేసేందుకు చదువు రాకున్నా కళాకారుల ప్రతిభ అద్భుతమని కితాబిచ్చారు. ఇక నుంచి సంకీర్తన మండలిని తెలుగు రాష్ట్రాల్లో విస్తరింపజేస్తామన్నారు.

తొలుత దేవనాద జీయర్ స్వామి అధ్యక్షపాన్యాసం చేస్తూ.. ఆధ్యాతిక పునాదులపై సామాజిక సేవతోపాటు భక్తి కళామార్గం రూపొందించేందుకు ఓరుగల్లు వేదికగా కార్యక్రమం నిర్వహించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఓరుగల్లుకు స్వామివారి రాకతోపాటు కళారూపాల ప్రదర్శన ఉమ్మడి జిల్లా నుంచి వేలాదిగా తరలివచ్చిన కళాకారులతో పర్వదిన సందడి కనిపిస్తోందన్నారు. నేపాల్ కృష్ణమాచార్య, సముద్రాల శఠగోపాచార్య, నాయిని నీలిమా రాజేందర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆచార్య పి.జ్యోతి, వికాస తరంగిణి కేంద్ర కమిటీ పక్షాన మహేందర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. వరంగల్, హనుమకొండ వికాస తరంగిణిల చైర్మన్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, మురళీకృష్ణతో పాటు వికాస తరంగిణి నిర్వాహకులు చాడ సుభాష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మురళీధర్‌రావు, తిరుమల్, ఉమా, ఆచార్య జ్యోతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదిక వద్ద తిరుమలగిరి నుంచి గంగిరెద్దులతో తరలివచ్చిన కళాకారుల విన్యాసాలను స్వామి ఆసక్తిగా తిలకించారు. గోమాత ప్రత్యేకతను తెలియచెబుతూ దానికి ఆహారాన్ని అందించారు. గిరిజన సంప్రదాయ ప్రదర్శన, చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శన, చింతు యక్షగానం, కూచిపూడి కళా నృత్య ప్రదర్శనలు దేనికదే ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. ఈ కార్యక్రమం ప్రారంభంలో హనుమాన్ చాలీసాపై స్వామివారితో సహ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు చేసిన నృత్యంతో ఓరుగల్లు ఓలలాడింది.


కోలాటం ఆడుతూ భజనలు చేస్తున్న మహిళలు


గూడూరులో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


డోర్నకల్‌లో గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


కురవిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్


తొర్రూరులో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న మాజీమంత్రి దయాకర్‌రావు

బీఆర్ఎస్ ఆందోళనలు

మహబూబాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలలు కావస్తున్న ఎన్నికల సమయంలో ఇచ్చినా ఆరు గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత ప్రశ్నించారు. మహబూబాబాద్‌లో మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత పాలనకు వ్యతిరేకంగా శాంతియుత నిరసన చేపట్టి, గాంధీజీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమలుకు నోచుకోని 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడం లో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. రైతు భరోసా విషయంలో సీఎం ఒకమాట, వ్యవసాయ మంత్రి ఒకమాట పొంతన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మళ్లీ మాజీసీఎం కేసీఆర్ పాలన మాకు కావాలని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు.

మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపుతుందని చెప్పారు. వర్షాకాలం పంట చేతికందిన ఇంత వరకు రైతు బంధు డబ్బులు అన్నదాతల ఖాతాలో పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పర్కాల శ్రీనివాస్ రెడ్డి, మార్నేని వెంకన్న, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ఎమ్డీ ఫరీద్, ముత్యం వెంకన్న, మహబూబ్ పాష, తేళ్ల శ్రీనివాస్, లూనావత్ అశోక్‌నాయక్, నల్లాని నవీన్‌రావు, నర్సింగం వెంకన్న, మార్నేని రఘు, బూర్ల ప్రభాకర్, కత్తుల ఎలేందర్, గోగుల రాజు, రామ రాజు యాకన్న, బోడ లక్ష్మణ్, ఇనుగుర్తి సుధాకర్, అసిఫ్, రాము, రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

తొర్రూరులోని గాంధీ విగ్రహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచాలని వినతిపత్రం అందించారు. అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించి చేతకానీ కాంగ్రెస్ సర్కార్‌కు బుద్ధి ప్రసాదించాలని మహాత్మాగాంధీని వేడుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు మంగళంపల్లి శ్రీనివాస్, సీతారాముడు, అంజయ్య, ప్రవీన్, ప్రదీప్ రెడ్డి, బిందు శ్రీను, సోమేశ్వర్‌రావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

• గార్ల గాంధీపార్కులోని మహాత్మా గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గంగావత్ లక్ష్మణ్‌నాయక్, పానుగంటి రాధాకృష్ణ, శీలంశెట్టి రమేష్, గాజుల గణేష్, మీగడ శ్రీనివాస్, తాళ్లూరి శ్రీను పాల్గొన్నారు.

• కేసముద్రంలో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గుగులోతు వీరునాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించగా మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, రఫీ, కిరణ్, బానోత్ వెంకన్న, తారాసింగ్, దేవేందర్, తరుణ్, రాజేష్, పాల్గొన్నారు.

• డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, పోటు జనార్ధన్, తేజావత్ రమేష్, మారబోయిన రాంభద్రం, శరత్‌బాబు, రహీం, జయరాం, బడేటి శ్రీను, ఏపూరు కృష్ణ, మధు, సత్యనారాయణ, యశోదర్‌జైన్, గౌస్‌పాష, బంధం రవి, లాలయ్య, బొర్రాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

• నెల్లికుదురులో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పరిపాటి వెంకట్‌రెడ్డి, ఎర్రబెల్లిమాధవి, బత్తిని అనిల్, పులి రామచంద్రు, అశ్విన్, కారం ప్రశాంత్, కడారి రమణ, బిక్కునాయక్, రెహమాన్, ఆకుల జగ్గయ్య పాల్గొన్నారు.

• గూడూరులో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, టౌన్ అధ్యక్షులు చీదురు వెంకన్న, ప్రచార కార్యదర్శి భూక్యసురేష్, బోడ ఎల్లయ్య, బత్తుల యాదగిరి, ఎడ్ల రమేష్, సంపంగిరాములు, మండల కుమార్, నూకల అశోక్, వల్లపు నాగరాజు వినతి పత్రం అందించారు.

• కురవిలో శ్రీవీరభద్రస్వామి దేవాలయం నుంచి గాంధీ సెంటర్ వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్ర అందించారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరిచేవిధంగా హైదరాబాద్ కాంగ్రెస్ నాయకులకు, ఢిల్లీ గాంధీలకు జ్ఞానోదయం చేయాలని మహాత్మగాంధీని వేడుకుంటున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోతు రవినాయక్, నూతక్కి నర్సింహారావు, జి.రాంచంద్రయ్య, కొండపల్లి శ్రీదేవి, పెద్ది వెంకన్న, దొంగరి నర్సయ్య, కొంతం విజయ్, నామ సైదులు, బాదావత్ రాజు, సంగెం భరత్, నూతక్కి సాంబశివరావు, మాలి వీరన్న, రొయ్యల నాగేశ్వర్‌రావు, బత్తుల వెంకన్న పాల్గొన్నారు.

గిరిజన హాస్టల్‌లో బాలికకు అస్వస్థత


జిల్లా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాలిక

కేసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో ఆరో తరగతి విద్యార్థిని సంజన అస్వస్థతకు గురైంది. బుధవారం రాత్రి వాం తులు, విరేచనాలు అవుతుండడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించగా స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడి నుం చి ఇంటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత గురువారం మళ్లీ అస్వస్థతకు గురికాగా అక్కడి నుంచి మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇదిలా ఉండ గా హాస్టల్‌లో మరికొంత మంది అస్వస్థతకు గురైనట్లు బాలిక చెబుతున్నట్లు పలువురు తల్లిదండ్రులు ఆరోపించారు.

జిల్లా వ్యాప్తంగా గాంధీజీ వర్ధంతి

మహబూబాబాద్ టౌన్, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. మానుకోట పట్టణంతో పాటు అన్ని మండలకేంద్రాల్లో మహనీయులు గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహబూబాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేతలు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ ప్రాత మరువలేనిదని, మహనీయులు గాంధీజీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పింగ్రాల రాందాసు, బండారు చిరంజీవి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

• మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీజీ వర్ధంతి సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అధికారులు, సిబ్బందితో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.


జిల్లా పోలీస్ కార్యాలయంలో మౌనం పాటిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, పోలీస్ అధికారులు

• మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని విశ్రాంతి భవనం వద్ద గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ వెంకటరామారావు, గోవర్ధన్, కందిబండ ప్రసాద్, కర్లపాటి మధు, తల్లాడ సురేష్, వాబిలిశెట్టి వేణు, బొల్లం గణేష్, బుద్ద శ్రీనివాస్, సోమ శ్రీనివాస్, జానికి రాములు పాల్గొన్నారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో మరిపెడ హైస్కూల్లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

• కేసముద్రంలోని గాంధీ విగ్రహానికి డీసీసీ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రునాయక్, యూత్ జిల్లా నాయకులు అజ్మీర సురేష్, మార్కెట్ కమిటీ సభ్యులు ఎండి.అయూబ్‌ఖాన్, చింతకుంట్ల యాదగిరి, తరాల వీరేష్, చిలువేరు సమ్మయ్యగౌడ్, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగోజు ప్రభురాణి, విజేందర్‌రెడ్డి, ఎండీ తాజోద్దీన్, కొండ సురేష్, రియాజ్‌ఖాన్ నివాళులు అర్పించారు.

• బయ్యారంలో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ ఇరువర్గీయుల ఆధ్వర్యంలో పూలమాలలో నివాళులర్పించారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్, సోమిరెడ్డి, సత్తిరెడ్డి, రవినాయక్, జనార్ధన్, రాధాకృష్ణ, కిషన్ నాయక్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్, నాగరాజు, సుమన్, రాకేష్ పాల్గొన్నారు.

విద్యార్థినిపై కత్తితో దాడి?

• మాస్కులు ధరించి, బైక్‌పై వచ్చి దాడికి యత్నించారని బాధితురాలి ఆరోపణ

• కొనసాగుతున్న పోలీసుల విచారణ

కేసముద్రం, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై గురువారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడికి యత్నించినట్లు ప్రచారం జరుగుతోంది. సదరు విద్యార్థిని ఉదయం 8.30 గంటల ప్రాంతంలో పాఠశాలకు వెళుతుండగా బైక్‌పై ఇద్దరు యువకులు మాస్క్ ధరించి, రైల్వేస్టేషన్ ఎటువైపు అని ప్రశ్నించినట్లు బాధిత బాలిక చెబుతోంది. రైల్వేస్టేషన్ ఉన్నవైపు చేయి చూపించగా ఒక యువకుడు కత్తితీసి చేయిపై దాడి చేయబోగా తాను లాక్కున్నానని, ఆపై కేకలు వేయడంతో సదరు వ్యక్తులు అక్కడి నుంచి బైక్‌పై పారిపోయినట్లు చెబుతోంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ విషయంపై ఎస్ఐ మురళీధర్‌రాజ్‌ను వివరణ కోరగా సీసీ ఫుటేజిలు పరిశీలించగా దాడి జరిగిన ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు. బాలిక కంగారుగా ఉందని, తదుపరి విచారణలో ఈ విషయంపై స్పష్టత వస్తుందని తెలిపారు.

ఇనుగుర్తి ఎంపీడీవోగా హరిప్రసాద్

ఇనుగుర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి తొలి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా జి.హరిప్రసాద్ గురువారం లాంఛనంగా విధుల్లో చేరారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో తాత్కాలికంగా నూతన మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కేసముద్రం మండల పంచాయతీ అధికారి (ఎంపీవో)గా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా మండల సాధన సమితి కన్వీనర్ చిన్నాల కట్టయ్య మాట్లాడుతూ నూతన మండలానికి ఒక్కో శాఖ కార్యాలయం ఏర్పాటవుతూ పూర్తిస్థాయిలో రూపాంతరం చెందుతుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

కార్మికులకు రూ.26 వేలు చెల్లించాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిళ్లకంటి సూర్యం, తెలంగాణ ప్రగతిశీల మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్వపల్లి వెంకన్న అన్నారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ నెల సకాలంలో వేతనాలు అందేలా చూడాలని కోరారు. అనంతరం మేనేజర్ శ్రీధర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఏర్పుల మహేందర్, రాములాల్, పుచ్చకాయల శ్రీనివాస్, ఉపేందర్, సోమయ్య, చిన్న యాకయ్య పాల్గొన్నారు.

కురవిలో అఘోరి..


కురవి చెరువు వద్ద కారులో ఆగిన అఘోరి నాగసాధువు

కురవి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అఘోరి నాగసాధువు గురువారం సాయంత్రం అకస్మాత్తుగా ప్రత్యక్షమైంది. కురవి చెరువు సమీపంలో అఘోరి కారు ఆగగానే అటుగా వెళ్తున్న యువకులు సెల్ఫీలు దిగారు. ఈ లోగా అటుగా ఆటోలో వెళ్తున్న ట్రాన్స్‌జెండర్లు అఘోరితో ఫొటోలు దిగేందుకు యత్నించగా, అఘోరి కారులోకి వెళ్లి డోర్ పెట్టుకుంది. కారులో కురవి గ్రామంలోకి రాగానే అఘోరి వీరభద్రస్వామి దేవాలయంలోకి వెళ్తుందని అందరూ భావించారు. అయితే అఘోరి నేరుగా ఖమ్మం వైపు వెళ్తా బైక్‌తో రోడ్డుపై ఆగిన యువకున్ని వీపుపై కొట్టింది. ఆపై ఖమ్మం దిశగా వెళ్లిపోయింది.

ఆత్మీయ భరోసా ఏదీ?

(5వ పేజీ తరువాయి)

గాంధీపురం, బేతోలు, రజాలిపేట, శనిగపురం, ఈదులపూసపల్లి, జమాండ్లపల్లి గ్రామాల కూలీలు, అదే సంవత్సరంలో జిల్లాలో కొత్తగా ఏర్పాటైన డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మునిసిపాలిటీల పరిధిల వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా పథకం అందని ద్రాక్షలా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు 20 రోజులకు పైగా ఉపాధి హామీ పనులు చేసి, గుంట భూమిలేని కూలీలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులని ప్రభుత్వం నిబంధనలు పెట్టడంతో మునిసిపాలిటీల పరిధిలోని కూలీలకు భరోసా దక్కకుండా పోయింది.

వలసల నివారణకు ఉపాధి..

గ్రామాల్లో పనుల్లేక నగరాలకు వలసలు వెళ్తున్న తరుణంలో నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చింది. తద్వారా గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించి, వలసలను నివారించారు. ఆ విధంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు లభించేవి. 2011లో మహబూబాబాద్ మేజర్ గ్రామ పంచాయతీనుంచి మునిసిపాలిటీగా మారడంతో ఇక్కడ ఉపాధి పనులను తీసి వేశారు. అదే విధంగా 2018లో పట్టణానికి నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న ఆరుగ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలో విలీనం చేయడంతో ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు కూలీలకు దక్కకుండా పోయాయి. వీటితో పాటు అదే సంవత్సరంలో డోర్నకల్, మరిపెడ, తొర్రూరు పంచాయతీలు మునిసిపాలిటీలుగా అప్‌గ్రేడ్ కావడంతో అందులో కూడా ఉపాధి హామీ పనులు లేకుండాపోయాయి. దీంతో ఉపాధి హామీ పనుల్లేక అక్కడి కూలీలు పట్టణాలకు వలసబాట పట్టారు. మునిసిపాలిటీల పరిధిలో ఉపాధిహామి పనులులేక ఆర్థిక ఇబ్బందులు పడుతూ కూలీలు వలసలు పోతున్నారని ఇప్పు డు ఆత్మీయ భరోసా పథకం కూడా పట్టణ కూలీలకు వర్తించడం లేదని మునిసిపాలిటీల్లోని కూలీలకు ఆత్మీయ భరోసాను అందించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా మునిసిపాలిటీల్లో ఉపాధి హామీ పనులను కల్పించాలని కోరుతున్నారు.

సీతానగరం ఆశ్రమ పాఠశాల విద్యార్థి అదృశ్యం


ఇస్లావత్ చరణ్

గూడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతానగరం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 13 సంవత్సరాల విద్యార్థి ఇస్లావత్ చరణ్ అదృశ్యమైనట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి గురువారం తెలిపారు. కేసముద్రం మండలం కోమటిపల్లి తండాకు చెందిన ఇస్లావత్ చరణ్ సంక్రాంతి సెలవులకు వెళ్లాడు. ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం 1.30 గంటలకు తండ్రి నరసింహ తన కుమారుడు చరణ్ సామాన్లు కొనిచ్చి, ఆశ్రమ పాఠశాల ముందు ఉంచి లోపలికి వెళ్లమని చెప్పి తాను గూడూరుకు తన కూతురును దించేందుకు వెళ్లాడు. ఆ తర్వాత ఈనెల 30వ తేదీన ఉదయం 7 గంటలకు గ్రామానికి చెందిన ఇస్లావత్ వికాస్ అనే విద్యార్థి తమ వార్డెన్ ఫోన్ ద్వారా చరణ్ తండ్రికి ఫోన్‌చేసి ఎందుకు హాస్టల్‌కు పంపించలేదని అడిగాడు. తాను 23 తేదీన పంపించానని, చెప్పగా చరణ్ అసలు హాస్టల్‌కి రాలేదని సమాధానం ఇచ్చాడు. అతని కోసం ఎక్కడ వెతికిన అచూకీ లభించలేదు. ఈ విషయంపై బాలుడు చరణ్ తండ్రి ఇస్లావత్ నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇస్లావత్ చరణ్ అచూకీ తెలిపిన వారికి రూ.10 వేల పారితోషికం అందజేస్తామని ఎస్సై తెలిపారు.

వివరాలకు తండ్రి నరసింహ సెల్ : 9666574633, గూడూరు పోలీస్‌స్టేషన్ : 8712656963, గూడూరు ఎస్సై సెల్ : 8712656962, గూడూరు సీఐ సెల్ : 8712656960 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గార్ల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కృష్ణవేణి బాధ్యతల స్వీకరణ



గార్ల జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డోర్నకల్ తహసీల్దార్‌గా పని చేస్తున్న కృష్ణవేణి గురువారం పదవీబాధ్యతులు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ కె.రవీందర్ సస్పెన్షన్ కావడంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. అదే విధంగా గార్ల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన జర్పుల సుధాకర్ నాయక్ నర్శింహులపేటకు బదిలీకాగా, ఆయన స్థానంలో అక్కడ పనిచేస్తున్న సంజీవ్ గార్లకు బదిలీ చేయడంతో గురువారం పదవీబాధ్యతలు చేపట్టారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

తొర్రూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తాచాటాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించి, ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త సమష్టిగా కృషిచేసి పార్టీ గెలుపు కోసం పనిచేయాలన్నారు. నాయకత్వం అంటే పదవులు కాదు బాధ్యతలు అని గుర్తు చేశారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. నిత్యం ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, తూనం శ్రావణ్, బాపురెడ్డి, ముద్దసాని సురేష్, రాంచంద్రయ్య, గుండాల నర్సయ్య, సురేందర్ రెడ్డి, బిజ్జాల అనిల్, డి.సోమన్న, పెదగాని సోమయ్య, కిషన్ యాదవ్, పట్టణ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యాలయాన్ని పరిశీలించిన కమిషనర్

కేసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం కేసముద్రం మునిసిపల్ కమిషనర్ ప్రసన్నరాణి పరిశీలించారు. ఇప్పటికే జీపీల్లోని చెక్కుబుక్కు, తీర్మానాల పుస్తకాలను తీసుకువెళ్లగా మిగిలిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ఫిబ్రవరి 6 వరకు విలీనమైన ఐదు జీపీల్లోని రికార్డులను, సిబ్బందిని మునిసిపాలిటీ పరిధిలోకి తీసుకువచ్చిన అనంతరం పూర్తిస్థాయి పాలన కొనసాగిస్తామని తెలిపారు.

విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

మహబూబాబాద్ రూరల్, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని మహబూబాబాద్ తహసీల్దార్ భగవాన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలం వీఎస్.లక్ష్మీపురంలో సివిల్ రైట్ డే కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్స్ గుగులోతు కిషన్‌నాయక్, కామ సంజీవరావు, ఎస్సై దీపికరెడ్డి, ఆర్ఐ కృష్ణప్రసాద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఈజీఎస్ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

తొర్రూరు, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : ఈజీఎస్‌లో పనిచేస్తున్న సిబ్బంది వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం ఈజీఎస్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపి ఏపీవో మధుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా సిబ్బందికి వేతనాలు అందడం లేదని, కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది కుక్కల కృష్ణ, సతీష్, కిషన్, సుధాకర్, పద్మ, ఉమ, రజిత, యాకలక్ష్మి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

నెల్లికుదురు, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులగూడెం గ్రామానికి చెందిన చల్లమల్ల గుట్టస్వామి (54) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు. ఈనెల 6న చల్లమల్ల గుట్టస్వామి తన ఇంటిముందు చెట్టు నరికి చదును చేస్తుండగా అదే గ్రామానికి చెందిన పెద్దూరి నర్సయ్య ఆ భూమి తనది, ఆ భూమిలో చెట్లను నరికి ఎందుకు చదును చేస్తున్నావని గుట్టస్వామిని నెట్టివేయడంతో కింద పడ్డాడు. కాలుకు గాయయంకాగా మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చి కొద్దిరోజులుగా విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో మళ్లీ ఈ నెల 29న ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య హైమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నాడు.

భార్యను హత్య చేసిన కేసులో భర్త అరెస్ట్

కేసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం వెంకటగిరిలో భార్యను కత్తితో పొడిచి హత్య చేసిన కేసులో భర్త వాంకుడోత్ రఘును గురువారం అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. ఈనెల 25న రఘు తన భార్య సుగుణ(30)ను తలపై కొట్టి కూరగాయలు కోసే కత్తితో పొట్టలో పొడవడంతో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ ఈనెల 28న మృతి చెందిన విషయం విధితమే. ఈ కేసులో నిందితుడు రఘును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

దాడిలో పలువురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి లక్ష్మీపురంలో గురువారం ఉదయం ఇరువర్గాల దాడిలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. ఆలకుంట్ల దేవమ్మ ఇంటిస్థలం గెట్టు విషయంలో అదే కాలనీకి చెందిన మరికొందరు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు చెప్పారు. ఈ విషయంపై ఆలకుంట్ల నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే కాలనీకి చెందిన గుంజే రాజు, శ్రీను, వీరయ్య, అర్జున్, మున్నేష్, ముతమ్మ, ఎల్లమ్మలపై కేసు నమోదు చేయగా, గుంజే రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆలకుంట్ల ముఖేష్, ఆలకుంట్ల నర్సయ్య, తురక యాకన్న, ఎల్లేష్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గీత కార్మికుడికి గాయాలు

తొర్రూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టుపై నుంచి పడిన గీత కార్మికుడు రావుల దామోదర్‌కు గాయాలు అయిన సంఘటన గురువారం తొర్రూరు మండలం సోమారంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. దామోదర్ రోజు మాదిరిగానే ఉదయం తాటివనంలో చెట్టు ఎక్కుతుండగా జారి కిందపడటంతో ఎడమ కాలువిరుగగా, తలకు గాయమైంది. వెంటనే కుటుంబసభ్యులు హన్మకొండలోని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుపై విచారణ

దంతాలపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మండల కేంద్రంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై గురువారం తొర్రూరు డీఎస్పీ క్రిష్ణకిషోర్ ఆధ్వర్యంలో విచారణ చేశారు. జరిగిన సంఘటనపై స్థానికుల వద్ద నుంచి సమాచారాన్ని సేకరించారు. విచారణ అనంతరం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ గణేష్, ఎస్సై పిల్లల రాజు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

• 30 లీటర్ల సారా, 600 లీటర్ల పానకం స్వాధీనం

• 6 గురిపై కేసు నమోదు

సీరోలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి సీరోలు మండలంలోని పలుతండాల్లో మహబూబాబాద్ ఎక్సైజ్, డీటీఎఫ్, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, సీరోలు పోలీసుల ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేసి, 6 గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నాగేశ్వర్‌రావు, నీరజ తెలిపారు. రేకులతండా, తునికిచెట్టు తండా, వస్రాంతండా, గుజిలితండాల్లో గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు చేసి 30 లీటర్ల గుడుంబా, 600 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. గుడుంబా కాచిన 6 గురిని సీరోలు తహసీల్దార్ శారద ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఎస్సైలు చంద్రశేఖర్, మౌనిక, కిరీటి, సీరోల్ ఎస్సై నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో వందశాతం ఫలితాలు సాధించాలి

• అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ


స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న లెనిన్ వత్సల్‌టొప్పొ

మహబూబాబాద్ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ అన్నారు. ఎస్సెస్సీ విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు ఇంగ్లీష్ ల్యాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ వారిచే రూపొందించిన ఐపాస్-2025 (స్టడీ మెటీరియల్)ను మహబూబాబాద్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంగ్లీష్‌లో సునాయసంగా పరీక్షరాసి అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ఈ మెటీరియల్ దోహదపడుతుందన్నారు. విద్యార్థులు డీఈవో రవీందర్‌రెడ్డి, స్టడీ మెటీరియల్ దాత కిరణ్‌ప్రసాద్ జుత్తి, వంగర లక్ష్మణ్, ఆజాద్ చంద్రశేఖర్, శ్రీరాములు, అప్పారావు, రాంమోహన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

• మానుకోట వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ సుధాకర్

సీరోలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల ఆరోగ్య ప్రదాయిని ముఖ్యమంత్రి సహాయనిధి అని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. చింతపల్లిలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి కర్ణాకర్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెక్కాడితే కానీ డొక్కనిండని నిరుపేదలను అనారోగ్యం బారిన పడితేవారిని ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోడ రమేష్, జెర్రిపోతుల మహేష్‌గౌడ్, భూక్య సైదులు, చెవుల నరేష్, సీతారాములు, నవీన్ పాల్గొన్నారు.